క్లుప్తంగా

సీఎంకు స్వాగతం పలికిన కనకారావు మాదిగ


సీఎం జగన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న కొమ్మూరి కనకారావు మాదిగ

నాగులుప్పలపాడు: విదేశీ పర్యటన ముగించుకొని శనివారం వేకువజామున రాష్ట్రానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని గన్నవరం విమానాశ్రయంలో మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

కౌంటింగ్ రోజు 144 సెక్షన్


ఎస్సై బ్రహ్మనాయుడు

నాగులుప్పలపాడు: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ నెల 4వ తేదీ 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు. ఫలితాల సందర్భంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు గుంపులుగా ఉండకూడదని, ఎలాంటి విజయోత్సవాలకు అనుమతులు లేనందున బాణసంచా కాలవడం, రంగులు చల్లుకోవడంతో పాటు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు అమలు చేయనున్నట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు.

పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలి

నాగులుప్పలపాడు: పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచిగా, సుచిగా పోషక విలువలతో అందించాలని ఎంఈఓలు రవి, రమణయ్య తెలిపారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీ నిర్వాహకులతో శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ సమావేశంలో విద్యార్థులకు సమతుల్య ఆహారం ఎలా అందించాలి అనే అంశంపై జిల్లా ఎండీయూ కో–ఆర్డినేటర్ కాశీ విశ్వేశ్వర శర్మ, ఎంఈవోలు నిర్వాహకులు వివరించారు. సిబ్బంది నాగార్జున, వెంకాయమ్మ, సీఆర్‌పీలు కల్యాణి, వెంకట్రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

దర్శి: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటుకున్న సంఘటన మండలంలోని కాశీనాయన వృద్ధాశ్రమంలో శనివారం జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు ఆశ్రమంలో అనాథ వృద్ధుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, దారం వాసుదేవరెడ్డిలు ఆయన మృతదేహానికి అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆశ్రమ నిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డిలు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో వేమయ్య స్వామి ఆరాధన

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్య స్వామి 262 ఆరాధన మహోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులైన డి.శ్రీనివాసులు, డి.బ్రహ్మం ఉదయం నాలుగు గంటలకు గణపతి పూజ, అభిషేకం, అఖండస్థాపన, అంకురారోపణం, మండల అవాహం కార్యక్రమాలను నిర్వహించి స్వామి ప్రత్యేక అలంకరణలతో పాటు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం ఆకవీడు, చినగానిపల్లె, చోళ్లవీడు, అక్కపల్లె, జేపీ చెరువు, అచ్చంపేట, ఆరవీటికోట గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తమ భక్తి చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ప్రారంభించారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి ప్రసన్నాంజనేయ స్వామి


తమలపాకుల అలంకరణలో అభయ ఆంజనేయ స్వామి


ఉప్పుగుండూరులో హనుమజ్జయంతి నిర్వహిస్తున్న అర్చకులు


సువర్చల ఆంజనేయ స్వామి కల్యాణం


తమలపాకుల పూజలో భక్తులు

ఒంగోలు మెట్రో: ఆంజనేయ స్వామి జయంతి మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. కొప్పోలు కేశవ క్షేత్రం, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరం, లాయర్ పేట చిట్టి ఆంజనేయ స్వామి మందిరం, మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, గడియారం వారి వీధి అనంత కోదండరామ స్వామి మందిరం, గద్దలగుంట ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానం తదితర చోట్ల పూజలతో పాటు కళ్యాణ మహోత్సవం వైభవోపేతంగా సాగింది. భక్తులు తీర్థ ప్రసాదాలను సేకరించారు. ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడిగా ఉన్న కార్యసిద్ధి ప్రసన్నాంజనేయ స్వామి వారికి హనుమజ్జయంతి సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. 108 లీటర్ల ఆవుపాలతో పంచామృత అభిషేకం, తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్ర అలంకరణ, విశేష పుష్పాలంకరణ, సహస్రనామార్చన జరిగింది.

ఒంగోలు రూరల్: రూరల్‌లోని పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతిని ఆయా గ్రామాల్లో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున నుంచి ఆలయాల అలంకరణ కార్యక్రమం దేవస్థాన వేదపండితులు శాస్త్రోక్తంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరవది, వలేటివారిపాలెం, త్రోవగుంట, ఉలిచి గ్రామాల్లోని ప్రసన్నాంజనేయ దేవాలయాలకు భక్తులు విరివిగా తరలివచ్చారు. ఈ గ్రామాల్లో ప్రసన్నాంజనేయ దేవాలయ ప్రధాన పూజారు వేదమంత్రాలతో భక్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తరలి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వదించారు. కరవదిలో ఈ రోజు నుంచి జూన్ 5వ తేదీ వరకు ఆంజనేయస్వామి వారికి ఉదయం 8 గంటలకు పంచామృతం అభిషేకం అనంతరం సహస్రనామార్చన, సాయంత్ర 8గంటలకు హనుమాన్ చాలీసా, అనంతరం పల్లకి సేవ ప్రతిరోజు జరుగుతుందని తెలిపారు. వలేటివారిపాలెం దేవస్థానంలో కోదండరామస్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు జరిగాయి.


నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా హనుమజ్జయంతి

నాగులుప్పలపాడు: హనుమాన్ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మనబ్రోలు, ఉప్పుగుండూరుతో పాటు అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉప్పుగుండూరు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ పూజారి శ్రీధర్ స్వామి వారికి ప్రత్యేక పూజల చేశారు.

ఆంజనేయస్వామి ఆలయం, వినాయక ఆలయంలోని పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉప్పుగుండూరు కల్చరల్ ఆధ్వర్యంలో శ్రీరామ మందిరం వద్ద ఏర్పాటు చేసిన చిన్నారుల క్లాసికల్ డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి.

రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత


రక్తదానం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఏజీఎం ఎస్డీ యూసఫ్ అలీ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామీద బ్యాంకు 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రెడ్ క్రాస్ కార్యాలయంలో శనివారం బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. 30 మంది రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, అత్యవసర శస్త్ర చికిత్సలు, కాన్పుల సమయంలో సకాలంలో రక్తం లభించక పోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోవాల్సి రావడం దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. హీమోఫీలియా బాధితులకు తరచుగా రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, అలాంటి వారు నేడు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. ఆరోగ్యవంతులైన పౌరులు తరచుగా రక్తదానం చేయడం వలన ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతారని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ శీనా నాయక్, సీనియర్ మేనేజర్ అభినయ్, రెడ్ క్రాస్ సభ్యులు మంగళగిరి నరసింహారావు, డీఎఫ్ఓ స్టాంటన్, టెక్నీషియన్ సంతోష్, సింధూర పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి


నోటు పుస్తకాలు అందిస్తున్న ప్రముఖులు

ఒంగోలు టౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతోనే సమ్మర్ క్యాంపులను నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ తెలిపారు. శనివారం ఎల్బీజీ భవనంలో జరిగిన సమ్మర్ క్యాంపు ముగింపు సభలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా వివిధ అంశాల మీద విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. చిన్నారుల్లో నిబిడీకృతమైన నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా చదువులు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులు వేసవి సెలవులను వృథా చేయకుండా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులను నిర్వహించడం అభినందనీయమని నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు చాపల వంశీ కృష్ణ అన్నారు. ఇలాంటి ప్రయత్నాలను మున్ముందు కూడా కొనసాగించాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్ పరీక్షలు రాసే ప్యాడ్, నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందించారు. వల్లెపు ధనుశ్రీ ప్రదర్శించిన యోగాకు ప్రశంసలు లభించాయి. రామన్, వెంకటేష్, కేఎఫ్ బాబు, ఇంద్రజ్యోతి, కోణంకి వరుణ్, జి. బాలకృష్ణ, యం. సుబ్బారావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సాయి మందిర ప్రతిష్టా మహోత్సవం


విద్యుత్ దీప కాంతులతో సాయిబాబ మందిరం

ఒంగోలు రూరల్: రూరల్‌లోని కరవది గ్రామంలో షిరిడి సాయిబాబ ప్రతిష్టా వార్షిక మహోత్సవం ఘనంగా జరిగింది. దశాబ్దం క్రితం ప్రతిష్టించిన పూర్తి చేసుకున్న షిరిడి సాయిబాబ మందిరం ప్రతి సంవత్సరం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఫలితంగా మందిర అభివృద్ధి జరుగుతోంది. ఈ నేపథ్యంలోని అన్నదానం, భోజనశాల ఆవరణం, ప్రత్యేక గదులు, నిర్మాణమయ్యాయి. ఈ భోజన శాలలోని ప్రతి గురువారం ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి నేటి వరకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఆటంకాలు లేకుండా జరుగుతోంది. శనివారం ఉదయం సాయిబాబ మందిర ప్రాంగణంలో విశేషంగా తరలి వచ్చారు. అనంతరం 11.30 నుంచి 12.30 వరకు కార్యక్రమాలు రఘుప్రదీప్ ప్రధాన పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు. అనంతరం ఉచిత అన్నదాన కార్యక్రమం వేలాదిమంది పాల్గొనగా నిరంతరాయంగా సాయంత్ర 3గంటల వరకు కొనసాగింది.

నేడు గుంటిగంగలో 'సుహాసినీ' పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గుంటిగంగా భవాని అమ్మవారి ఆలయంలో ఏకాదశి ఆదివారం రోజున 108 మంది ముత్తైదువులతో అత్యంత భక్తిశ్రద్ధలతో సుహాసినీ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. సుహాసినీ పూజా కార్యక్రమంలో పాల్గొనదలిచిన భక్తులు ముందుగా ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. పూజా కార్యక్రమంలో పాల్గొంటే సకల సౌభాగ్యాలు కలిగి, భర్తల అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని ఆలయ పూజారులు తెలిపారు.

ఎన్నిక వేళ మద్యం పంపిణీకి కుయుక్తులు

మద్దిపాడు: మండలంలోనికి మద్యం చాపకింద నీరులా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు సమయంలో అల్లర్లు సృష్టించడానికి కొందరు నాయకులు ఈ మద్యాన్ని గత నాలుగు రోజులుగా మండలంలో మద్యాన్ని చేరవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈమేరకు నిఘా వర్గాలు కూడా మద్యం ఎక్కడ నుంచి సరఫరా అవుతుందన్న విషయాన్ని కూపీ లాగుతున్నారని ప్రస్తుతం ఆమద్యం ఎక్కడ నిల్వ చేశారన్న విషయమై ఆరా తీస్తున్నట్లు సమాచారం. నాగులుప్పలపాడు మండలంలోని ఒక మద్యం దుకాణం నుంచి భారీగా మద్యాన్ని సదరు నాయకులు కొనుగోలు చేయించి మండలంలోకి తెచ్చినట్లు తెలిసింది. మండలంలో ఏదైనా గొడవ జరిగితే మద్యం అక్రమంగా రవాణా కాకుండా అడ్డుకోవాల్సిన సెబ్ అధికారులు భారీ మొత్తంలో మద్యం కొనుగోళ్లు జరిగినా పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు బాధ్యులు అవుతారని స్థానికులు వ్యాఖ్యలు చేస్తున్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి

● డ్వామా పీడీ అర్జునరావు

కొనకనమిట్ల: గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టి అర్హులైన అందరికీ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ అర్జునరావు పేర్కొన్నారు. శనివారం ఆయన కొనకనమిట్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పుడూ చేపట్టే పనులు కాకుండా సన్న, చిన్న కారు రైతుల పొలాల్లో ఫారం పాండ్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జామ, నిమ్మ, మామిడి మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పనులు చేసే దగ్గర కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఏపీడీ పద్మశ్రీ, ఎంపీడీఓ టి.సుగుణమ్మ, ఏపీఓ బుల్లెన్నరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

బాలినేనిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


బాలినేనిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

ఒంగోలు: మాజీమంత్రి, ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ నేతలు పలువురు శనివారం హైదరాబాద్‌లో బాలినేని నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఒంగోలు నియోజకవర్గంలో తమ పరిధిలో జరిగిన ఎన్నికల సరళి గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కటారి ప్రసాద్, 14వ డివిజన్ అధ్యక్షుడు చావలి శివప్రసాద్, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం శేషయ్య, 22వ డివిజన్ నాయకులు కుట్టుబోయిన కోటి యాదవ్, సాంస్కృతిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఫణిదపు సుధాకర్, తాటిపర్తి రాగయ్య తదితరులున్నారు.

ముగిసిన వేసవి హాకీ శిక్షణ శిబిరం


హాకి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

చీమకుర్తి: నెల రోజుల పాటు నుంచి నిర్వహిస్తున్న హాకీ వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసిందని పీఈటీ రవికుమార్ తెలిపారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో నెల రోజుల నుంచి జిల్లా స్థాయి హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. నెల రోజుల పాటు క్రీడాకారులను తీర్చిదిద్దినట్లు రవికుమార్ తెలిపారు. రానున్న రోజులలో జిల్లాస్థాయి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లా నుంచి హాకీ క్రీడలో పాల్గొనే క్రీడాకారులకు ఈ శిక్షణా కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. హాకీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

మద్దిపాడు: ఓట్ల లెక్కింపు రోజు ఏపార్టీ వారైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మద్దిపాడు ఎస్ఐ వి. మహేష్ తెలిపారు. ఈనెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు సందర్భంగా పార్టీలకు చెందిన కార్యకర్తలు బాణసంచా కాల్చడం గులాములు చల్లడం వంటి పనులు చేయరాదని ఆయన తెలిపారు. ఎదుటి పార్టీ వారినిరెచ్చగొట్టే ధోరణిలో సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టింగులు పెట్టరాదని ఆయన తెలిపారు. మండలంలో 4వ తేదీన 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రజలు గుంపులుగా చేరవద్దని హెచ్చరించారు. 4వ తేదీన ఎంతటి వారైనా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే వారిపై పూర్తి స్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సహాయ సాంఘిక సంక్షేమాధికారికి ఘన సన్మానం


ఉదయశ్రీని సన్మానిస్తున్న సంక్షేమ శాఖ డీడీ, సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు సహాయ సాంఘిక సంక్షేమ అధికారిగా ఎం. ఉదయశ్రీ ఉత్తమ సేవలు అందించారని వక్తలు కొనియాడారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం పదవీవిరమణ పొందిన ఉదయశ్రీకి ఆత్మీయ సన్మాన సభను హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి. అంకబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్. లక్ష్మానాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విధులు నిబద్ధతతో అప్పగించిన పనిని చాలా చక్కగా చేశారని కొనియాడారు. తన తల్లిదండ్రుల మధ్య ఉదయశ్రీ పదవీవిరమణ చేయటం ఆమె అదృష్టం అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, కృపారావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీ.కేశవరావు, ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.